


నేడు విత్తన మేళా..
కంపాసాగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం వరి విత్తన మేళా నిర్వహించనున్నారు. - 8లో



బుద్ధుడు గొప్ప దార్శనికుడు
మానవాళికి జీవన విధానాన్ని అందించిన దార్శనికుడు బుద్ధుడు అని పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అన్నారు. - 8లో

గరిష్ఠం / కనిష్ఠం
$40^{0} / 28^{0}$

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు నేడు చివరి గడువు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

భానుపురి (సూర్యాపేట) : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు శుక్రవారం చివరి గడువు అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటరావు వెల్లడించారు. ఎమ్మెల్సీ పోలింగ్ రోజు విధులు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఉద్యోగుల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంకతో కలిసి గురువారం పరిశీలించి మాట్లాడారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోవచ్చని సూచించారు. ఈనెల 22, 23 తేదీల్లో 182 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసినట్లు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ 'అడ్వాన్స్‌డ్' పరీక్షలు

సూర్యాపేటటౌన్ : జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరం జనరల్‌లో 5,879 మంది, ఒకేషనల్‌లో 725 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ 2076 మంది, ఒకేషనల్ 465 మంది పరీక్షలు రాయనున్నారు. మొత్తం 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి సెంటర్‌కు ఒక సీఎస్, డీఓను నియమించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఐఈఓ కృష్ణయ్య తెలిపారు.

నేడు పాలిసెట్

సూర్యాపేటటౌన్ : పాలిటెక్నిక్ కళాశాల్లో ప్రవేశాలకు పాలిసెట్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కో ఆర్డినేటర్ సీహెచ్.నర్సింహారావు తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాల్లో హాల్ టికెట్ నంబర్లు వేశారు. ఆయన పలు సెంటర్లను పరిశీలించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 2,382 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఉదయం 10గంటల వరకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 11గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, 11గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్‌తో పాటు పెన్సిల్, బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్, ఎరైజర్ తెచ్చుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి (సూర్యాపేట) : వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన బాల బాలికలకు 2024లో అందించనున్న ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు జూలై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిణి వి.వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డు ప్రదానోత్సవంలో భాగంగా మెడల్, సర్టిఫికెట్, ఇతర గిఫ్ట్‌లు ఉంటాయని, 5 నుంచి 18 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఇన్నోవేషన్, సోషల్ సర్వీస్, ధైర్య సాహసాలు, పాండిత్యం, క్రీడలు, కళలు, సాంస్కృతిక కళలు వంటి సేవ రంగాలో ప్రావీణ్యం కలిగి ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో https://awards.gov.in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతిని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందించాలని కోరారు.

జూన్ 3 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

సూర్యాపేటటౌన్ : జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలో 471 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వీరి కోసం హుజుర్‌నగర్ ఉన్నత పాఠశాల, జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సెంటర్లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోకి సిబ్బందికి, విద్యార్థులకు, చీఫ్ సూపరింటెండెంట్‌లకు సెల్ ఫోన్ అనుమతి లేదని పేర్కొన్నారు.

రేపటితో ఆఖరు

పతాక స్థాయికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- వాయిస్ ఫోన్‌కాల్స్‌తో ఓట్లడుగుతున్న అభ్యర్థులు
- ప్రచారంలో దూసుకెళ్తున్న ప్రధాన పార్టీలు
- ఓటర్లను ఆకర్షించేందుకు తాయిలాలు!



దేవరకొండలో జరిగిన పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారానికి శనివారం సాయంత్రంతో తెరపడనుంది. 27వ తేదీన పోలింగ్ జరగనుండడంతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల ముఖ్య నేతలంతా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ సభలు, సమావేశాలు నిర్వహిస్తూనే పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులతోపాటు స్థానిక నేతలతో ప్రచారం నిర్వహిస్తోంది. ఆ పార్టీ నాయకులు పట్టణాలు, గ్రామాలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను తీసుకొని ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఫోన్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇక బీఆర్‌ఎస్, బీజేపీ రాష్ట్ర స్థాయి నేతలు సభలు, సమావేశాలతో ప్రచార జోరు పెంచారు.

ఓటర్లను ఆకర్షించేందుకు ప్రణాళికలు

ప్రచారానికి రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. సోమవారం ఎన్నికలు జరగనున్నాయి. దీంతో మూడు ప్రధాన పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. పెద్ద ఎత్తున సభలు, సమావేశాలతో పాటు తమ అనుచరులు, పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పట్టభద్రులైన ఓటర్లను కలిసే విధంగా ప్రణాళికలు చేసుకుని ముందుకు సాగుతున్నారు. ఎన్నికల్లో ఈ నాలుగు రోజులే కీలకం కావడంతో ఎక్కడికక్కడ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి అయితే పావలావంతు ఓటర్లకు డబ్బు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది.

గిఫ్టులతో ఆకట్టుకునేలా..

పట్టణాలు, గ్రామాల్లో వార్డుల వారీగా ఎంత మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారనే సమగ్ర వివరాలను సేకరించారు. ఓటరు స్లిప్పుల ఆధారంగా ఆయా పార్టీల నేతలు ఓటర్ల వివరాలను వివరాలు తీసుకొని పోల్ మేనేజ్‌మెంట్‌కు సిద్ధమయ్యారు. క్షేత్రస్థాయిలోని నేతలు తమ పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు? అందులో తమ పార్టీకి అనుకూలంగా ఉండేవారు ఎందరు అన్న వివరాలతో కూడిన నివేదికలను పార్టీ ముఖ్య నేతలకు, ఎన్నికల ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్న నేతలకు అందజేశారు. తద్వారా ఆయా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఓ ప్రధాన పార్టీ పెద్ద ఎత్తున గిఫ్టులను సైతం కొనుగోలు చేసినట్లు తెలిసింది.

గెలవాలనే పట్టుదలతో..

ఈ ఎన్నికలు మూడు ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. పదేళ్ల తర్వా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తోంది. తమ పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉండడంతో వారికి బాధ్యతలు అప్పగించి మరీ ప్రచారం చేయిస్తోంది. ఇక.. బీఆర్‌ఎస్‌కు ఇది సిట్టింగ్ స్థానం కావడంతో తిరిగి పొందాలనే లక్ష్యంతో ప్రచారం చేస్తోంది. కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సహా మాజీ మంత్రులు రంగంలోకి దిగారు. బీజేపీ కనీసం ఈసారైనా పట్టభద్రుల స్థానాన్ని దక్కించుకోవాలని ప్రయత్నిస్తోంది. ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, డీకే అరుణ, డాక్టర్ లక్ష్మణ్ వంటి నేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు.

రికార్డెడ్ వాయిస్‌తో ఫోన్‌కాల్స్

కొందరు అభ్యర్థులు పట్టభద్రులను ప్రసన్నం చేసుకునేందుకు రికార్డెడ్ వాయిస్‌తో కూడిన ఫోన్‌కాల్స్ చేస్తూ తమకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఓటర్లకు రోజూ ఐదు నుంచి పది కాల్స్ చేసేలా ఏర్పాట్లు చేశారు. మరికొందరు తమ పార్టీ అభ్యర్థుల తరఫున పట్టభద్రుల ఓటర్లకు స్వయంగా ఫోన్ చేసి మరీ ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అభ్యర్థి తరఫున ఓటరు జాబితా ఆధారంగా ఇంటింటికి తిరుగుతూ తమ పార్టీ అభ్యర్థికి ఓట్లు వేయాలని కోరుతున్నారు. ప్రధానంగా పట్టణాల్లో అయితే ఒక్కో వార్డులో 500 లోపే ఓటర్లు ఉన్నందున వారిని గుర్తించడం సులభం కాబట్టి వారిని కలిసి అభ్యర్థించే పని పెట్టుకున్నారు. లేదంటే ఓటరు జాబితాలోని ఫోన్ నంబర్ల ఆధారంగా ఫోన్ చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు.

కల్యాణం.. కమనీయం



తాళిబొట్టు చూపుతున్న అర్చకులు



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

- మట్టపల్లిలో వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుడి తిరుకల్యాణం
- భారీగా తరలివచ్చిన భక్తులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి తిరుకల్యాణోత్సవాన్ని గురువారం తెల్లవారు జామున 5గంటలకు వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. అర్చకులు క్రిష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బ్రహ్మ చార్యులు, ఫణిభూషణమంగాచార్యులు బృందం శ్రీస్వామి అమ్మవార్లకు జీలకర్ర,బెల్లం, యజ్ఞోపవీతం, తాళిబొట్టు ,తలంబ్రాలు తదితర కార్యక్రమాలతో కల్యాణతంతును ముగించారు. కల్యాణతంతును వీక్షించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. అంతకు ముందు గుండ్లపల్లి భక్తులు ఎదుర్కోళ్ల దివిటీలు సమర్పించగా , పల్నాడు జిల్లా ముత్యాలంపాడు గ్రామస్తులు, సూర్యాపేట జిల్లా లింగగిరి వాస్తవ్యులు శ్రీస్వామి, అమ్మవార్లకు వార్షికంగా మెట్టెలు, మంగళసూత్రం ,ఉత్తర జంధ్యాలు, వస్త్రాలు, తలంబ్రాల బియ్యం సమర్పించారు. కాగా ఉదయం ఆలయంలో పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీకేశవతీర్థ ఆశ్రమంలో కల్యాణమూర్తులకు గరుడవాహన సేవ నిర్వహించారు. అదేవిధంగా నృసింహోపాసనం పద్యపఠనం, వేదపఠనం, భక్తిసంగీతం, శ్రీసీతారామకళ్యాణం హరికథ, శ్రీమట్టపల్లి క్షేత్ర మహత్యం బుర్రకథ చేపట్టారు. భక్తిసంగీత విభావరి అనంతరం శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మిచెంచులక్ష్మీసమేతంగా రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమందరాజు, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్‌కుమార్, ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో కల్యాణోత్సవానికి తరలివచ్చిన భక్తులు

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు తగ్గించాలి

- డీఎంహెచ్‌ఓ కోటాచలం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం

సూర్యాపేటటౌన్ : 'జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్లు తగ్గించాలి.. నిబంధనలకు విరుద్ధంగా సిజేరియన్ కాన్పులు చేస్తే ఆస్పత్రులను అనుమతులు రద్దు చేస్తాం' అని డీఎంహెచ్‌ఓ కోటా చలం హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సిజేరియన్ సెక్షన్ ఆడిట్ కమిటీ సమావేశంలో ఆయన సమీక్షించి మాట్లాడారు. ఇక నుంచి ప్రతి సిజేరియన్ సెక్షన్ కాన్పులపై ఆడిట్ జరుగుతుందని, నిబంధనలకు విరుద్ధంగా కడుపుకోత ఆపరేషన్లు నిర్వహించిన ఆస్పత్రుల నుంచి వివరణ కోరుతామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహించిన సిజేరియన్ సెక్షన్ కాన్పుల ప్రతి కేస్ షీట్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రొఫెసర్లు డాక్టర్ అమితకుమారి, డాక్టర్ దమయంతి క్షుణ్ణంగా పరిశీలించి అభిప్రాయాలు తెలియజేశారు. ఈ సమీక్షలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

నేడు కోదాడకు బండి సంజయ్ రాక

కోదాడరూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కోదాడలో జరిగే సమ్మేళనానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండిసంజయ్ రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి తెలిపారు. గురువారం కోదాడ పట్టణంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమ్మేళనానికి పట్టభద్రులతో పాటు పట్టణంలోని పలువురు ప్రముఖులను ఆహ్వానించేందుకు చొరవ చూపాలని ఆయన పార్టీ నాయకులను కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపునకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ అసెంబ్లీ కో ఆర్డినేటర్ విద్యాసాగర్, కనగాల వెంకటరామయ్య, అక్కిరాజు యశ్వంత్, నూనె సులోచన, యాదా రమేష్, వంగవీటి శ్రీనివాసరావు, బొలిశెట్టి కృష్ణయ్య, బంగారు కవిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే విజయం

- పట్టభద్రుల ఓటర్ల సమ్మేళనంలో ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్

సూర్యాపేట : పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాలకు గాను బీజేపీ 12 స్థానాలు గెలుచుకుంటుందని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లోనూ బీజేపీదే విజయం అని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం రాత్రి సూర్యాపేట జిల్లాకేంద్రంలోని సదాశివరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సూర్యాపేట నియోజకవర్గ పట్టభద్రుల ఓటర్ల సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. అధికార యావ తప్పా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సమస్యలపై పట్టింపు లేదన్నారు. రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదని, ఆరు ఏళ్లుగా నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగులు కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారని తెలిపారు. అనుకున్న స్థాయిలో ఉద్యోగాలు రాకపోతేనే తెలంగాణ ఉద్యమం సాగిందన్నారు. ఉద్యోగ క్యాలెండర్ పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్‌ను ఆరునెలలైనా వేయలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రాధాన్యత లేని పార్టీ అని, కాంగ్రెస్ అభ్యర్థి ప్రశ్నించే గొంతుక కాదు.. ప్రభుత్వంలో పిల్లి అన్నారు. చెప్పిన హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని, 4వేల నిరుద్యోగ భృతి ఇవ్వకుంటే కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. ప్రపంచ దేశాలు శభాష్ మోదీ అంటుంటే ప్రతిపక్షాలు సన్నాయినొక్కులు నొక్కుతున్నాయని దుయ్యబట్టారు. ప్రేమేందర్‌రెడ్డి ని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నేతి సుభాష్‌రెడ్డి, కేఎస్ రత్నం, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, మున్సిపల్ మాజీచైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, జనార్దన్ రెడ్డి, కడియం రామచంద్రయ్య, మన్మథరెడ్డి, శ్రీలత రెడ్డి, రుక్మారావు, చలమళ్ల నర్సింహ పాల్గొన్నారు.

తప్పును కప్పిపుచ్చుకునేందుకు విశ్వప్రయత్నం



మున్సిపల్ కార్యాలయ స్టోర్‌రూంలో ఉంచిన మోటార్లు, కొన్ని పైపులు

- మూడు మోటార్లు తెచ్చి స్టోర్‌రూంలో వేసిన కోదాడ మున్సిపల్ అధికారులు
- వాటిలో ఒక్కటి మాత్రమే కొత్త మోటారు
- పైపులు తేవడం మరిచిన సిబ్బంది

కోదాడ: చేసిన తప్పును కప్పి పుచ్చుకునే క్రమంలో కోదాడ మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లు అడ్డంగా దొరికిపోయారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో వేసిన నాలుగు బోర్ల మోటార్లు మాయం అయిన విషయాన్ని 'ప్రభుత్వ నిధులు హాంఫట్' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో బుధవారం కోదాడ మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లు ఆగమేఘాల మీద సమావేశం ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ల మధ్య నెలకొన్న విభేదాలే గొడవకు కారణమని చెప్పుకొచ్చారు. అధికారుల తప్పిదం ఏమి లేదని, పత్రికలకు కొందరు తప్పుడు సమాచారం ఇచ్చారని మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. గత సంవత్సరం వేసిన బోర్లు ఎండిపోవడంతో వాటిలో ఉన్న మోటార్లు చోరికి గురికాకుండా తెచ్చి స్టోరూంలో ఉంచామని కమిషనర్ చెప్పుకొచ్చారు. వాస్తవానికి బుధవారం స్టోర్‌రూం పరిశీలిస్తే రెండు పాత మోటార్లు, ఒక కొత్త మోటారు ఉన్నాయి. బోరు నుంచి తీస్తే అది పాతమోటారుగా ఉండాలి. కానీ స్టోర్‌రూంలో కొత్త మోటారు ఉంది. అంటే ఒక బోరులో అసలు మోటార్ వేయలేదని తెలుస్తోంది. బోర్ల విషయంలో గొడవ జరగడంతో ఆ కాంట్రాక్టర్ రెండు రోజుల క్రితం ఒక కొత్తమోటారు తెచ్చి స్టోర్‌రూంలో పెట్టినట్లు సమాచారం. మూడు మోటార్లకు సంబంధించి బోరులో వేసిన పైపులు 60 నుంచి 80 వరకు ఉండాలి. కానీ అక్కడ కేవలం 15 పైపులు ఉన్నాయి.ఎంబీ పరిశీలిస్తే ఎన్ని పైపులు కొన్నది తెలుస్తుంది.ప్యానల్ బోర్డులు, వైర్లు, ఎక్కడ ఉన్నాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

ఘనంగా బుద్ధపూర్ణిమ వేడుకలు



ఫణిగిరి బౌద్ధక్షేత్రం వద్ద బుద్ధపూర్ణిమ వేడుకల్లో పాల్గొన్న బోధిసత్వ ఫౌండేషన్ సభ్యులు

నాగారం : ఫణిగిరి బౌద్ధక్షేత్రం వద్ద బుద్ధ ధ్యానవనంలో గౌతమ బుద్ధుడి జయంతి సందర్భంగా వైశాఖ బుద్ధపూర్ణిమ వేడుకలను గురువారం బోధిసత్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రొఫెసర్ తాటికొండ వెంకటరాజయ్య మాట్లాడారు. ఫణిగిరి బౌద్ధక్షేత్రాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా మార్చాలన్నారు. అనంతరం బౌద్ధక్షేత్రంపై ఉన్న మహాస్థూపం వద్ద అఖండ జ్యోతిని వెలిగించి దమ్మదీక్ష, బుద్ధవందన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో బోధిసత్వ ఫౌండేషన్ అధ్యక్షుడు పులిగిల్ల వీరమల్లు యాదవ్, గోవర్ధన్, కొత్తగట్టు మల్లయ్య, నాతి వెంకన్న, అశోక్‌రెడ్డి, కిరణ్‌కుమార్, కమటం శోభ, విజయ్, లింగమల్లు పాల్గొన్నారు.

నవయాన బుద్దిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో..

ఫణిగిరిలో వైశాఖ బుద్ధ పూర్ణిమ వేడుకలను నవయాన బుద్దిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బుద్దిస్ట్ సొసైటీ అధ్యక్షుడు రాంబాబు, డీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు, పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సయ్య, బాలకృష్ణ, మణికుమారి, తిరుపత్తి, నాగరాజు, మల్లేష్, కరుణాకర్, రమేష్, వెంకటేష్, బాబేష్ పాల్గొన్నారు.

ఓ వైపు సీజ్.. మరోవైపు అనుమతి!

- ప్రైవేట్ ఆస్పత్రుల విషయంలో అధికారుల తీరుపై అనుమానాలు
- ఐదేళ్లుగా అర్హత లేని డాక్టర్లతోనే నిర్వహణ
- కనీస చర్యలు తీసుకోకుండా మళ్లీ అనుమతులు



ఇదీ కోదాడలో ఐదేళ్లగా నిర్వహిస్తున్న ప్రైవేట్ వైద్యశాల. ఇందులో ఇద్దరు అర్హత లేని వైద్యులు పనిచేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో గత నెల18న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. కానీ నెల రోజులు కాకముందే తిరిగి తెరవడానికి ఆ వైద్యశాల నిర్వాహకులకు అనుమతులు ఇచ్చారు. గతంలో అర్హతలు లేని వైద్యులు పని చేయడంతో ఈ వైద్యశాలను సీజ్ చేశామని ప్రస్తుతం ఎంబీబీఎస్ వైద్యుడి పేరుతో దరఖాస్తు చేసుకోవడంతో అనుమతిచ్చామని, గతంలో పని చేసిన వైద్యులకు నోటీసులు జారీ చేశామని చెప్పడం గమనార్హం.

కోదాడ: అర్హతలేని డాక్టర్లతో వైద్యం చేయిస్తున్న కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల విషయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. ఆస్పత్రులపై ఫిర్యాదులు రావడంతో వాటిని తనిఖీ చేసి సీజ్ చేసిన అధికారులు నెలరోజులు తిరగకుండానే అర్హతగల డాక్టర్ వచ్చాడంటూ మళ్లీ అనుమతులు జారీ చేయడం విస్మయం కలిగిస్తోంది. ఈ వ్యవహారం కోదాడలో చర్చనీయాంశమైంది.

అసలు విషయం ఏమిటంటే..

గత నెలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కోదాడలోని కొన్ని ప్రైవేట్ వైద్యశాలలను తనిఖీ చేసి సీజ్ చేశారు. విదేశాలలో చదివి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్ పాస్ కాకుండా, రిజిస్టర్ నంబర్ లేకుండా వైద్యం నిర్వహిస్తున్నారని, మరి కొందరు ఎంబీబీఎస్ డిగ్రీకి బదులు ఎండీ అని రాసుకుంటున్నారని చెబుతూ ఆయా వైద్యశాలలను జిల్లా వైద్యాధికారి కోటాచలం ఆధ్వర్యంలో సీజ్ చేశారు. నెల రోజులు తిరగక ముందే ఒక వైద్యశాలను తిరిగి తెరవడానికి అనుమతులు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో ఇక్కడ పని చేసిన వైద్యులకు అర్హతలు లేకపోవడంతో సీజ్ చేశామని వారికి నోటీసులు కూడా ఇచ్చామని అధికారులు చెబుతున్నారు. అర్హతలు లేని వైద్యుల చేత ఐదు సంవత్సరాలుగా వైద్యశాల నిర్వహిస్తుంటే జిల్లా అధికారులు ఏం చేస్తున్నారన్నది అంతుచిక్కని ప్రశ్న. ఇదే వైద్యశాల నిర్వాహకులు అర్హతలున్న డాక్టర్ వచ్చాడని దరఖాస్తు చేసుకున్నారని అందుకే అనుమతులు ఇచ్చామని అధికారులు చెప్పడం విస్మయం కలిగిస్తోంది.

మొక్కుబడిగా తనిఖీలు

అర్హతలేని వైద్యుల చేత నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు జిల్లాలో పదుల సంఖ్యలో ఉన్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న కొంత మంది అధికారుల, సిబ్బంది కనుసన్నల్లోనే నడుస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఇలాంటి వైద్యశాలలపై ఫిర్యాదులు రావడంతో అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి కొన్నింటిని సీజ్ నెల రోజులు తిరగక ముందే మళ్లీ అనుమతులు ఇస్తూ వస్తున్నారు.

కలెక్టర్ జోక్యం చేసుకోవాలి



అర్హతలేని వైద్యశాలల విషయంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారుల తీరు అనుమానాలకు తావిస్తోంది. కోదాడలో జిల్లా ఉపవైద్యాధికారి, మరోజిల్లా స్థాయి అధికారి నివాసం ఉంటున్నారు. వారు కనీసం పట్టించుకోవడంలేదు. అర్హతలు లేని వైద్యులు వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

– కుదరవల్లి బసవయ్య, సామాజిక కార్యకర్త, కోదాడ

అర్హతలున్న వైద్యుడి పేరుతో దరఖాస్తు చేశారు

కోదాడలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న న్యూనాగార్జున వైద్యశాలలో ఇద్దరు అర్హతలు లేని వైద్యులు పని చేస్తుండడంతో తనిఖీ చేసి సీజ్ చేశాం. వైద్యశాలకు, వైద్యులకు నోటీసులు జారీ చేశాం. వైద్యశాల నిర్వాహకులు ఎంబీబీఎస్ వైద్యుడి పేరుతో మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. అందుకే అనుమతి ఇస్తున్నాం. మళ్లీ అందులో పాతవారే పని చేస్తుంటే తనిఖీ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– డాక్టర్ కోటాచలం, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

క్లుప్తంగా

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

నల్లగొండ: 'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి వచ్చేనెల 26 వరకు ఆసక్తి గల మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తారు. ఇక్కడ త్రెడ్డింగ్, వ్యాక్స్, సెడిక్యూర్, మెనిక్యూర్, బ్లీచింగ్, స్కిన్ కేర్, హెయిర్ కేర్, వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, డ్యాండ్రఫ్ ట్రీట్‌మెంట్, హెయిర్‌ఫాల్ ట్రీట్‌మెంట్, హెయిర్ కట్స్, హెయిర్ స్టైల్స్, హెన్నా ప్రిపరేషన్, డై అప్లికేషన్, మేకప్స్ (బ్రైడల్, పార్టీ, లైట్ మేకప్స్), హెయిర్ మసాజ్, కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, ఫేషియల్స్ తదితర వాటిల్లో శిక్షణ ఉంటుంది. శిక్షణ కోసం ఈనెల 27 వరకు నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్ లో గల సాహితీ బ్యూటీ పార్లర్ అండ్ ట్రెనింగ్ సెంటర్‌లో రూ.3వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌లు అందజేస్తారు. ఇతర వివరాల కోసం 9666013544, 80747 42864 సెల్‌నంబర్లలో సంప్రదించాలి.

ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్ : రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై నిందారోపణలు చేస్తున్న బీజేపీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, కౌన్సిలర్ కస్తాల శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలో సీఐ చరమందరాజుకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. 35ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడు అవినీతి మచ్చఎరుగని మంత్రి ఉత్తమ్‌పై యూటాక్స్ అని, కేంద్ర నాయకత్వానికి నిధులు పంపుతున్నాడని ఆరోపించడం తగదన్నారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని బీజేపీ కేంద్ర నాయకత్వం గుర్తించాలని ఇలాంటి నిరాధార ఆరోపణ చేయడం అవివేకమన్నారు. ఇప్పటికైనా మహేశ్వర్‌రెడ్డి మంత్రి ఉత్తమ్‌కు, ప్రభుత్వానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేని ఎడల ప్రజాక్షేత్రంలో, ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన రీతిలో బుద్ధిచెబుతామని అన్నారు.

మంత్రి వెంకట్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



మంత్రి వెంకట్‌రెడ్డికి చిత్రపటం బహూకరిస్తున్న రేఖ, అగస్త్య దంపతులు

అర్వపల్లి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అడివెంల గ్రామానికి చెందిన జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి, రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ-సినీ మ్యూజిక్ డైరెక్టర్ అగస్త్య దంపతులు గురువారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం బహూకరించారు.

ఆదర్శ పాఠశాలలు పిలుస్తున్నాయ్..

- 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈనెల 25 వరకు గడువు
- ఒక్కో పాఠశాలకు 160సీట్లు
- జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం



కేతేపల్లి : కొర్లపహాడ్‌లోని ఆదర్శ పాఠశాల

కేతేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఇంటర్మీడియట్ ఆంగ్లమాధ్యమంలో చదవాలనుకునే వారికి ఆదర్శ పాఠశాలలు ఓ వరంలా మారాయి. ఈ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంలో మెరుగైన విద్యతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం, పలురకాల మౌలిక వసతులు కల్పిస్తుండటంతో వాటికి ఆదరణ పెరిగింది. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈనెల 10నుంచి 25వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు.

ప్రతి పాఠశాలకు 160 సీట్లు..

ఆదర్శ పాఠశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, గ్రూపులుండగా ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ప్రతి పాఠశాలలో 160మందికి అవకాశం కల్పించనున్నారు. ఈ కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులకు బోధించనున్నారు.

బాలికలకు హాస్టల్ సౌకర్యం..

ఆదర్శ పాఠశాలలో చదువుకునే బాలికలకు హాస్టల్ వసతి ఉంది. 9,10 తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 100మందికి ఈ అవకాశం ఉంది. హాస్టల్‌కు కనీసం మూడు కిలోమీటర్ల నుంచి ఆపై దూరంగా గ్రామాల నుంచి వచ్చే వారు మాత్రమే వసతిగృహంలో ప్రవేశానికి అర్హులు.

రేపటితో ముగియనున్న గడువు..

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 25(శనివారం) వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పాఠశాలలో ఇంటర్ విద్యతో పాటు ఎంసెట్, నీట్, సీఏ, సీపీటీ కోచింగ్‌తో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా అడ్మీషన్‌కు దరఖాస్తు చేయవచ్చు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగానే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీట్లను భర్తీ చేస్తారు. ఈనెల 26న దరఖాస్తులు పరిశీలించి ఎంపికైన వారి జాబితాలను పాఠశాలల్లో ప్రదర్శిస్తారు. ఈనెల 27నుంచి 31వరకు ఎంపికైన విద్యార్థుల విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలించి ప్రవేశాలు కల్పించి జూన్ 1నుంచి తరగతులు ప్రారంభించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు చక్కని క్రమశిక్షణ ఉంటుంది. అనుభవం కలిగిన అధ్యాపకులతో బోధన ఉంటుంది. మంచి వసతులు ఉన్నాయి. మంచి ఫలితాలు వస్తున్నాయి. ఆటలకు ప్రాధాన్యతనిస్తాం. మెరుగైన ఫలితాలతో ముందంజలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సబితారెడ్డి, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల, కొర్లపహాడ్

మహోన్నత వ్యక్తి అనంతరామ శర్మ



అనంతరామశర్మ పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం, వీరయ్య తదితర నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నల్లగొండ టౌన్: సమసమాజ నిర్మాణం కోసం అహర్నిశలు పోరాడిన మహోన్నత వ్యక్తి, తెలంగాణ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పెన్నా అనంతరామశర్మ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో పెన్నా అనంతరామశర్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. అనంతరరామ శర్మ ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని, ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడిన వ్యక్తి శర్మ అని కొనియాడారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. అనంతరామ శర్మ ప్రజాసంఘాల్లో కీలక బాధ్యతలు నిర్వహించి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషిచేశారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ శర్మ నిస్వార్థ ఉద్యమకారుడని.. రాజకీయాల్లో సౌమ్యంగా ఉంటూ కఠిన నిర్ణయాలు తీసుకునేవాడని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీరయ్య, మల్లు లక్ష్మి, డీజీ నర్సింహారావు, జూలకంటి రంగారెడ్డి, సీపీఎం నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మల్లు నాగార్జున రెడ్డి, ఎండీ జహంగీర్, సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సీపీఐ, సీపీఎం నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, తుమ్మల వీరారెడ్డి, పాలడుగు నాగార్జున, నారి ఐలయ్య, ప్రభావతి, కందాల ప్రమీల, బండ శ్రీశైలం, చినపాక లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు మాదగోని శ్రీనివాసగౌడ్, పిల్లి రామరాజు పాల్గొని నివాళులర్పించారు.

పిట్టంపల్లిలో అంత్యక్రియలు

కట్టంగూర్: సీపీఎం సీనియర్ నేత పెన్నా అనంత రామశర్మ అంత్యక్రియలు గురువారం కట్టంగూర్ మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో అశ్రునయనాల నడుమ జరిగాయి. గ్రామంలో సీపీఎం కళాకారులు పాటలు పాడుతూ అంతిమయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట సీపీఎం జిల్లా కార్యదర్శులు, కటికం సత్తయ్యగౌడ్, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, ఇటికాల సురేందర్, బొజ్జ చినవెంకులు, మాజీ ఎంపీపీ కొండ లింగస్వామి, చెవుగోని సాయిలు, చిన్నపాక లక్ష్మినారాయణ, మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి పాల్గొన్నారు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు

గౌతమ బుద్ధుడు గొప్ప దార్శనికుడు

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌నాయుడు

నాగార్జునసాగర్: ప్రపంచ మానవాళికి చక్కటి జీవన విధానాన్ని అందించిన గొప్ప దార్శనికుడు గౌతమ బుద్ధుడు అని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌నాయుడు అన్నారు. గురువారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బుద్ధ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కర్ణాటక రాష్ట్రంలోని బైలు కుప్పే సెర బౌద్ధారామానికి చెందిన గేషే నవాంగ్ జుంగే, సికింద్రాబాద్ మహాబోధి బుద్ధ విహారం నుంచి వచ్చిన శీలం చారోలాతో కలిసి బుద్ధుడి పాదాల వద్ద పూజలు చేశారు. అనంతరం మహాస్తూపం అంతర్భాగంలోని ఆచార్య నాగార్జున కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన చరిత్ర విభాగం పూర్వ అధ్యక్షుడు, చరిత్రకారిణి ఆచార్య అలోక పరా షేర్ షీకు బౌద్ధంలో స్నేహం అనే అంశంపై, శాతవాహన విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య మల్లేష్ సంకశాల బౌద్ధంలో సామాజికత అనే అంశంపై ప్రసంగించారు. బుద్ధవనం కన్సల్టెంట్ బౌద్ధ పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి రచించిన బుద్ధుడి మొదటి ప్రవచనం, బుద్ధుడి చివరి రోజులు పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్‌డీ సూదన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉపేందర్‌రెడ్డి, హోటల్స్ జీఎం నాదన్, జిల్లా పర్యాటక అధికారి శివాజీ, విజయ్ విహార్ మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.



బుద్ధుడి పాదాల వద్ద పూజలు చేస్తున్న రమేష్‌నాయుడు

నృసింహనామాలు రాసిన బియ్యపు గింజలు అందజేత

మఠంపల్లి : మిర్యాలగూడ పట్టణానికి చెందిన గుంటూరు ప్రేమవర్షిణి తన భక్తిభావాన్ని చాటుకుంది. ఆమె తన భక్తివిశ్వాసంతో 41రోజుల పాటు ఉపవాసం, మౌనదీక్షతో 31,116 బియ్యపు గింజలపై రాసిన నృసింహనామాలను తలంబ్రాలుగా గురువారం తెల్లవారుజామున మట్టపల్లిలో జరుగుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణవేదికపై అర్చకులకు అందజేసింది. ఈ సందర్భంగా ఆమెను ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించారు.



అర్చకులకు బియ్యం గింజలు అందజేస్తున్న ప్రేమవర్షిణి

నేడు కృషి విజ్ఞాన కేంద్రంలో విత్తన మేళా

త్రిపురారం: కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం కంపాసాగర్‌లో శుక్రవారం వరి విత్తన మేళా నిర్వహించనున్నట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు, వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ లింగయ్య గురువారం తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జేజీఎల్ 27356 (అతి చిన్న గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ.1,100, కేఎన్ఎం 118(దొడ్డు గింజ రకం) 25 కేజీల బ్యాగ్ రూ. 1,100. జేజీఎల్ 24423 (దొడ్డు గింజ రకం) 25 కేజీలు రూ.1,100 ఉన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం కంపాసాగర్ ఆధ్వర్యంలో కేఎన్ఎం 118 (దొడ్డు గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ. 1100, ఎంటీయూ 1010 (దొడ్డు గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ. 1100, కేపీఎస్ 2874 (సన్న గింజ రకం) 20 కేజీల బ్యాగ్ ధర రూ.1556, కేపీఎస్ 6521 (సన్న గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ. 1200 ఉందని తెలిపారు.

పాత నేరస్తుడి దారుణ హత్య

- మూసీ నదిలో మృతదేహం వెలికితీత
- పోలీసుల అదుపులో నిందితులు



లింగు (ఫైల్)

భువనగిరి క్రైం: జనవరి 16న కనిపించకుండా పోయిన భువనగిరి మండలంలోని పచ్చర్లబోడు తండాకు చెందిన కునుసోతు లింగు దారుణ హత్యకు గురయ్యాడు. మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ విచారణ చేయగా.. ఈ లింగు హత్యకు గురైన విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు గురువారం మూసీ నదిలో లింగు మృతదేహం వెలికితీశారు. పచ్చర్లబోడు తండాకు చెందిన కునుసోతు లింగు(45) తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. తన చెల్లెలితో అదే గ్రామానికి చెందిన బానోతు దేవిసింగ్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో తరచూ అతడిని బెదిరించేవాడు. దీంతో దేవిసింగ్ భయాందోళనకు గురై అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడైన నరేష్ సాయంతో జనవరిలో లింగును హత్య చేసి గ్రామ శివారులో ఉన్న మూసీ నది మధ్యలో పడేసినట్లు తెలుస్తోంది. అనంతరం తన పైకి రాకుండా లింగు చెల్లెలితో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు బానోతు దేవిసింగ్‌ను అనుమానించి పలుమార్లు విచారణ చేపట్టారు. గురువారం దేవిసింగ్‌ను భువనగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో కునుసోతు లింగుని తన వ్యవసాయ క్షేత్రం వద్ద హత్య చేసి ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి మూసీ నదిలో వేసినట్లు చెప్పాడు. కాగా.. లింగుపై గతంలో హత్య కేసు, దొంగతనాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి.

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా కారు బోల్తా

- ఒకరు మృతి.. నలుగురికి గాయాలు

రామగిరి(నల్లగొండ): తిరుపతికి దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా తిప్పర్తి వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. కారులో ఉన్న మిగతా నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. చలివాది రేఖా ప్రియాంక(31), భర్త శివసుబ్రహ్మణ్యం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నివాసం ఉంటున్నారు. ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు నిక్షిత్, తేజ్ వర్ధన్‌లు ఉన్నారు. కుటుంబంతో కలిసి తిరుపతికి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. గురువారం తెల్లవారుజామున డ్రైవర్ కడియపుడి మహేంద్ర అతివేగంతో కారు నడపడంతో అదుపుతప్పి బోల్తా పడింది. కారులో ఉన్న రేఖాప్రియాంక అక్కడికక్కడే మృతి చెందింది. భర్త శివసుబ్రహ్మణ్యం, ఇద్దరు పిల్లలు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మృతురాలి తండ్రి చలువాది వెంకట సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ మహేంద్రపై ఎస్సై కేసు నమోదు చేశారు. నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



ఘటనా స్థలిలో రేఖా ప్రియాంక మృతదేహం

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో యువకుడు మృతిచెందిన సంఘటన ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నంద్యాల మల్లారెడ్డి పెద్ద కుమార్తె శిరీషకు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఏదులవారిగూడేనికి చెందిన యల్మరెడ్డి వెంకటరెడ్డితో 22 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హేమంత్‌రెడ్డి (19) హైదరాబాద్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇటీవల అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. హేమంత్‌రెడ్డి గురువారం సాయంత్రం తాత మల్లారెడ్డి ట్రాక్టర్ తీసుకొని కల్టివేటర్‌తో చెల్క దున్నడానికి వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే ఉన్న గాతులో పల్టీ కొట్టింది. దీంతో హేమంత్‌రెడ్డిపై ట్రాక్టర్ పడడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

మేళ్లచెరువు: చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మేళ్లచెరువు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన షేక్ హుస్సేన్ గురువారం మధ్యాహ్నం సమయంలో గ్రామంలోని చెరువుకట్ట సమీపంలో ఉన్న చింతచెట్టు ఎక్కి చిగురు కోస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య షేక్ షాజీదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పరమేష్ తెలిపారు.

తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారడంతో తీవ్ర గాయాలు

తుంగతుర్తి: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన అన్నారం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాలకుర్తి యాదయ్య రోజు మాదిరిగా గురువారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

విద్యుదాఘాతంలో పాడి గేదెలు మృతి

నడిగూడెం: మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతిచెందాయి. గ్రామంలోని దేవరం వీరారెడ్డికి చెందిన రెండు పాడి గేదెలు గురువారం మేత మేసి ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో షార్ట్‌సర్క్యూట్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. దాదాపు రూ.లక్షన్నర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. సంబంధిత అధికారులు స్పందించి నష్ట పరిహారం చెల్లించాలని కోరాడు.

స్థలం విషయంలో గొడవ

- కేసు నమోదు

మేళ్లచెరువు : ఇంటి స్థలం విషయంలో ఇరువురు గొడవపడి గాయపరుచుకున్నారు. ఈ ఘటన మండలంలోని హేమ్లాతండా గ్రామపంచాయతీ పరిధిలోని రాఘవాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవాపురం గ్రామానికి చెందిన కన్నేటి పెద సైదయ్య, బారి రాము ఇరువురు ఇంటి స్థలం వివాదంలో ఉండడంతో గొడవపడ్డారు. దీంతో వారు మాటామాటా పెరిగి ఒకరినొకరు కొట్టుకున్నారు. ఇరువురి ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

వృద్ధురాలు అదృశ్యం

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం ఆవాసం గ్రామమైన మిట్టగూడేనికి చెందిన వృద్ధురాలు అదృశ్యమైంది. మిట్టగూడేనికి చెందిన దారావత్ కోటమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నెల రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన పెద్దకుమార్తె తేజావత్ సుశీల ఇంటికి వెళ్లింది. ఈ నెల 17న సుశీల పనినిమిత్తం హుజూర్‌నగర్ పట్టణానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా కోటమ్మ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. బంధువుల ఇంటికి కూడా వెళ్లకపోవడంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.ముత్తయ్య తెలిపారు.

ఉరివేసుకొని మహిళ బలవన్మరణం

మోత్కూరు : తల్లిపై కొడుకు చేయి చేసుకోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ తల్లి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన మంచె కుమారస్వామి – రేఖ దంపతులకు కుమారుడు మచ్చగిరి (నాని), కూతురు వైష్ణవి ఉన్నారు. కుమారుడు మచ్చగిరి హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదివి ఫెయిల్ అయ్యాడు. దీంతో తల్లి చదువుపై శ్రద్ధపెట్టి మంచిగా చదువుకోవాలని కొడుకు మచ్చగిరిని మందలించింది. ఆవేశంతో కొడుకు తల్లి రేఖపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆమె తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. భర్త కుమారస్వామి భార్యను వంట చేయడానికి తలుపు తట్టడంతో ఎంతకూ తీయకపోగా తలుపు పగులకొట్టి చూడగా అప్పటికే రేఖ మృతి చెందింది. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందగా స్థానిక ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

యాదాద్రి కొండపై కూలిన చలువ పందిళ్లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంతో పాటు యాదాద్రి కొండపైన బుధవారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో యాదాద్రి కొండపైన పరిసరాలలో చలువ పందిళ్లు కుప్పకూలాయి. దీంతో ఉదయం భక్తులు ఆయా మార్గాల్లో నడిచే సమయంలో ఇబ్బందులు పడ్డారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తమై.. కూలిపోయిన చలువ పందిళ్లను తొలగించారు.



యాదాద్రి కొండపై ఈదురు గాలులతో నేలకూలిన చలువ పందిళ్లు